నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I హైదరాబాద్, శనివారం 21 జూన్ 2025 SANGAREDDY



సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అల్లిపూర్‌లోని అన్నపూర్ణ రిజర్వాయర్ (ఫైల్)

**ఒక నాడు మెతుకు సీమ అంటే నెర్రెలు బారిన**, బీడు భూములు, ఎండిన చెరువులు... నీటి కోసం వందల ఫీట్ల లోతు బోర్లు వేసినా చుక్క రాకపోయేది. సమైక్య పాలనలో ఉమ్మడి మెదక్ జిల్లాలో ఒక్క ప్రాజెక్టు నిర్మాణం చేయకపోగా కనీసం తట్టెడు మట్టి ఎత్తినపాపాన పోలేదు. ఇవన్నీ సమైక్య రాష్ట్రంలో రైతులు పడ్డకష్టాలు.. స్వరాష్ట్రం వచ్చిన తర్వాత ఉద్యమ నేత తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ కావడంతో రైతు సంక్షేమానికి పెద్దపీట వేశారు. గోదావరి నీళ్లను బీడు భూములకు మళ్లించారు. నీటి పారుదల రంగానికి భారీగా నిధులు కేటాయించి పెద్ద ఎత్తున ప్రాజెక్టులు నిర్మించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో వందలాది చెరువులు, చెక్‌డ్యామ్‌లను మండుటెండల్లోనూ నింపారు. ఎక్కడో పుట్టిన గంగమ్మను తీసుకువచ్చి రంగనాయక, మల్లన్నసాగర్ రిజర్వాయర్లు నింపుకుంటూ 618 మీటర్ల ఎత్తులో ఉన్న కొండపోచమ్మ రిజర్వాయర్‌లోకి మళ్లించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో గోదావరి జలాలు పారి పచ్చని పంటలతో మెతకుసీమకు పూర్వవైభవం వచ్చింది. ఇవ్వాళ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలు చేస్తుంది. ప్రాజెక్టును నిర్వీర్యం చేసే పన్నాగం పన్నుతుంది.

# కాళేశ్వర జలం.. పంటలకు జీవం



సిద్దిపేట జిల్లా తొగుట మండలం తుక్కాపూర్‌లోని మల్లన్న సాగర్ రిజర్వాయర్ (ఫైల్)

- మండు టెండల్లో సైతం మత్తళ్లు దుంకిన చెరువులు
- రైతుల సాగునీటి కష్టాలు తీర్చిన ఘనత గులాబీ అధినేత కేసీఆర్‌దే
- బీడు భూముల్లో పారించిన కాళేశ్వరం జలాలు
- పుష్కలంగా పండుతున్న పంటలు... పెరిగిన పంట దిగుబడి
- కాళేశ్వరం ప్రాజెక్టుతో వివిధ వర్గాలకు ఉపాధి
- బహుళ ప్రయోజనాలు ఉన్న ప్రాజెక్టుపై ప్రభుత్వం కుట్రలు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడుతున్న రైతులు

## రైతుల పాలిట దేవుడు కేసీఆర్



కాల్వల ద్వారా మా గ్రామానికి గోదావరి నీళ్లు వస్తున్నాయంటే కేసీఆర్ సారు దయవల్లనే. ఆయన మా రైతుల పాలిట దేవుడు. కాళేశ్వరం నుంచి మల్లన్నసాగర్ ప్రాజెక్టు కాల్వల ద్వారా గోదావరి నీళ్లు రావడం నిజంగా మా అదృష్టం. మాజీ సీఎం కేసీఆర్ వల్ల సాగునీటి గోస తీరింది. వానకాలం, యాసంగి పంటలకు నీళ్లు పుష్కలంగా లభిస్తున్నాయి. నాలుగేండ్ల నుంచి సాగునీటికి ఇబ్బంది లేదు. ఐదు ఎకరాల్లో వరి పంట పండిస్తున్నా. మల్లన్నసాగర్ నిర్మించకముందు కేవలం ఎకరంలో పంట సాగు చేసేది. అదికూడా వర్షాలు పడితేనే పంట సాగుచేసేది లేకపోతే బీడుగా ఉండేది. మల్లన్న సాగర్ కాల్వల ద్వారా నీరు రావడం వల్ల గ్రామంలో బీడుభూములు కనిపించడం లేదు. మా పొలం పక్క నుంచి కాల్వ ద్వారా నీళ్లను చూస్తే..కడుపు నిండినట్లు ఉంది. కాళేశ్వరం నీటితో పుష్కలంగా రెండు పంటలు పండించుకుంటున్నాం. ఇందుకు గులాబీ అధినేత కేసీఆర్ సారుకు రైతులంతా రుణపడి ఉంటారు.నిజమైన రైతు బాంధవుడు కేసీఆర్ సారు.

- చిర్ర రవి, రైతు, అప్పనపల్లి, దుబ్బాక మండలం, సిద్దిపేట జిల్లా

## సంతోషంగా పంటలు పండించుకుంటున్నాం



మా ఊరి పక్కన రంగనాయకసాగర్ రిజర్వాయర్ నిర్మించడంతో సంతోషంగా పంటలు పండించుకుంటున్నాం.బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ ప్రాంతంలో సాగునీటి వసతి లేదని ఆలోచించి ఇక్కడ రిజర్వాయర్ కట్టించింది. పెద్దరిజర్వాయర్ నిర్మించడంతో రైతులు, మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. రిజర్వాయర్ లేక ముందు ఉపాధి కోసం ముంబాయి, గల్ఫ్, ఇతర ప్రాంతాలకు వెళ్లేది. అప్పటి పరిస్థితులు గుర్తుకు వస్తే మళ్లీ అలాంటి బాధలు రావద్దనిపిస్తుంది. కేసీఆర్, హరీశ్‌రావు గొప్ప నాయకులు. ఇక్కడి రైతుల బాధలు చూసినవాళ్లు కాబట్టి సాగునీటి గోస లేకుండా కాళేశ్వరంలో భాగంగా చంద్లాపురం పక్కన రంగనాయకసాగర్ కట్టించారు. సాగునీటిగోస తీర్చిన కేసీఆర్, హరీశ్‌రావును ఎప్పటికీ మరువం. రైతులంతా రుణపడి ఉంటారు.

-మిద్దెల రమేశ్ , రైతు,చందులపూర్, చిన్నకోడూరు మండలం, సిద్దిపేట జిల్లా



సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్రాపూర్‌లోని రంగనాయక సాగర్ రిజర్వాయర్ (ఫైల్)

## ఉమ్మడి మెదక్ జిల్లాలో సాగునీరు పుష్కలం

సిద్దిపేట, జూన్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కేసీఆర్ భగీరథ ప్రయత్నం..మాజీ మంత్రి హరీశ్‌రావు నిరంతర శ్రమ ఫలితంగా గోదావరి జలాలతో బీడుభూములు పచ్చని పంటపొలాలుగా మారాయి. సిద్దిపేట జిల్లాను సస్యశ్యామలం చేసే గోదావరి జలాలు మిడ్‌మానేరు నుంచి వస్తున్నాయి. మేడిగడ్డ నుంచి తరలించిన కాళేశ్వరం జలాలు సిద్దిపేట జిల్లాలోని కొండపోచమ్మ ప్రాజెక్టుకు చేరుతున్నాయి. తెలంగాణ వచ్చిన (2014 ) తర్వాత సిద్దిపేట జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అత్యధిక శాతం నిధులు ఖర్చుచేశారు. కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును మూడున్నర ఏండ్లలో పూర్తి చేయించారు. మిషన్ కాకతీయలో చెరువులను పునరుద్ధరించడం, పూడికతీత పనులు చేపట్టారు. అత్యధిక సంఖ్యలో చెక్‌డ్యామ్‌లు నిర్మించడం వల్ల భూగర్భజలాలు పెరిగాయి.

**కాళేశ్వరం ప్రాజెక్టు స్వరూపం ఇలా..**


బహుళార్థసాధక కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణలోని 13 ఉమ్మడి జిల్లాల్లో 18.26 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందించేందుకు, 18.83 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించాలని ప్రతిపాదించారు. ఇందులో భాగంగా ఏడు లింకులు, మూడు బ్యారేజ్‌లు, 15 రిజర్వాయర్లు, 22 పంప్‌హౌస్‌లు, 98 కిలోమీటర్ల ప్రెషర్ మెయిన్లు, 1,531 కిలో మీటర్ల ప్రధాన కాల్వ, 203 కిలో మీటర్ల పొడవుగల సొరంగం నిర్మించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జలాశయాల నిలువ సామర్థ్యం మొత్తం 141.00 టీఎంసీ గోదావరి నీరు మెడిగడ్డ బ్యారేజీ లెవెల్ +88 మీ. నుంచి కొండ పోచమ్మ సాగర్ రిజర్వాయర్ లెవెల్ +618 మీ. ఎత్తుకు బహుళదశల్లో లిఫ్ట్ చేస్తున్నారు.

**జిల్లాలోని రిజర్వాయర్ల స్వరూపం ఇలా..**

కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ - 10లో భాగంగా మిడ్‌మానేరు నుంచి గోదావరి నీటిని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు తరలిస్తున్నారు. దీని కెపాసిటీ 3.50 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరి, సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అల్లీపూర్, ఎల్లాయిపల్లి, కొచ్చగుట్టపల్లి గ్రామాల మధ్యన ఈరిజర్వాయర్ నిర్మించారు. ఈ రిజర్వాయర్ ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లాలో 30వేల ఎకరాల ఆయకట్టు, సిద్దిపేట జిల్లాలో 15,200 ఎకరాలు సాగులోకి వచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ - 11లో అన్నపూర్ణ నుంచి రంగనాయకసాగర్ రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోస్తున్నారు. దీని కెపాసిటీ 3 టీఎంసీల సామర్థ్యం. ఇది చంద్లాపూర్, పెద్దకోడూరు గ్రామాల మధ్య ఒక ద్వీపకల్పంలా ఉంటుంది. రిజర్వాయర్ మధ్యలో ఉన్న గుట్టపై ఎస్ఈ కార్యాలయంతోపాటు ఫోర్‌సూట్ గెస్ట్ హౌజ్ నిర్మించారు. ఈ రిజర్వాయర్ బండ్ నిర్మాణం 8.6 కిలో మీటర్ల పొడవు ఉంటుంది. 2020 ఏప్రిల్ 23న అప్పటి మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు పంపులను ఆన్‌చేసి గోదావరి జలాలను విడుదల చేశారు. ఈ రిజర్వాయర్ నుంచి లక్షా 10 వేల ఎకరాలకు సాగునీరందుతుంది. దీనికి కుడి ,ఎడమ కాల్వలు నిర్మించారు. కొమురవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను 23 ఫిబ్రవరి-2022, కొండపోచమ్మ రిజర్వాయర్‌ను 29 మే-2020లో మాజీ సీఎం కేసీఆర్ జాతికి అంకితం చేశారు. సిద్దిపేట జిల్లాలోని బెజ్జంకి మండలం తోటపల్లి వద్ద 0.32 టీఎంసీల సామర్థ్యంతో తోటపల్లి ఆన్‌లైన్ రిజర్వాయర్ ఉంది. కొమురవెల్లి మండలం ఐనాపూర్ - తపాస్‌పల్లి గ్రామాల శివారు మధ్య తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను 0.50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. ఈ రిజర్వాయర్ ద్వారా జనగామ నియోజకవర్గంలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, బచ్చన్నపేట మండలాల్లోని చెరువులను ప్రతిసంవత్సరం నింపుతున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలంలో గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. దీని సామర్థ్యం 8.23 టీఎంసీలు.ఇటీవలనే పంపులను ఆన్‌చేసి ట్రయల్ రన్ సైతం చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆప్రాజెక్టు ముందుకు కదలడం లేదు.

**అన్నపూర్ణ (అనంతగిరి) రిజర్వాయర్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరి, సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అల్లీపూర్, ఎల్లాయిపల్లి, కొచ్చగుట్టపల్లి గ్రామాల మధ్య అన్నపూర్ణ (అనంతగిరి 3.50 టీఎంసీల సామర్థ్యం) రిజర్వాయర్ నిర్మించారు. దీనిని సుమారు రూ. 2,700 కోట్లతో చేపట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ - 10లో భాగంగా రాజరాజేశ్వర రిజర్వాయర్ నుంచి నీటిని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నారు. అప్రోచ్ చానల్, గ్రావిట్ కెనాల్ 2.380, మెయిన్ కెనాల్ 7.65 కిలో మీటర్లు ఉంది. తిప్పారం వద్ద 400/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. ఇల్లంతకుంట మండలం తిప్పారం వద్ద ఆసియాలోనే అతిపెద్ద ఓపెన్ సర్జిపుల్ పంపు నిర్మించారు. ఈ రిజర్వాయర్‌తో రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో 30 వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి వచ్చింది.



సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం కొండపోచమ్మ రిజర్వాయర్ (ఫైల్)

**రంగనాయక సాగర్ రిజర్వాయర్**

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ - పెద్దకోడూరు గ్రామాల శివారులో రంగనాయక సాగర్ రిజర్వాయర్‌ను 3 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ 11లో భాగంగా నిర్మించిన ఈ రిజర్వాయర్ బండ్ 8.65 కి.మీ పొడవు ఉంటుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్నపూర్ణ రిజర్వాయర్ (బండ్ ) 1.746 కి.మీ వద్ద స్లూయిస్(తూం) ఏర్పాటు చేసి నాలుగు గేట్లు బిగించారు. హెడ్‌రెగ్యులేటర్ ద్వారా గ్రావిటీ కెనాల్, సొరంగం ద్వారా గోదావరి జలాలు రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేస్తున్నారు.ఈ రిజర్వాయర్‌ను 24 ఏప్రిల్-2020లో అప్పటి మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, కేటీఆర్ ప్రారంభించి జాతికి అంకితం చేశారు.

**కొమురవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్**

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కొమరవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్ 50టీఎంసీలసామర్థ్యంతో నిర్మించారు. కేంద్ర జల సంఘం సూచనల మేరకు వ్యవసాయానికి, తాగు నీటికి, పరిశ్రమలకు నీటి సరఫరాలో అంతరాయం లేకుండా తొగుట మండలం దగ్గర ఈ భారీ రిజర్వాయర్ నిర్మించారు.ఈ రిజర్వాయర్ నిర్మించడం కోసం తొగుట, కొండపాక మండలాల్లో భూమి సేకరించగా ఎర్రవల్లి, సింగారం, పల్లెపహాడ్, వేములఘాట్,ఏటిగడ్డ కిష్టాపూర్, లక్ష్మీపూర్, రాంపూర్, బ్రాహ్మణ బంజేరుపల్లి ముంపునకు గురికాగా తొగుట, తుక్కాపూర్,తిప్పారం, మంగోల్ గ్రామాలు పాక్షికంగా ముంపునకు గురయ్యాయి. ఈ ప్రాజెక్టు నిర్వాసితులకు గజ్వేల్ మండలంలోని ముట్రాజ్‌పల్లి, సంగాపూర్ గ్రామాల్లో 600 ఎకరాల్లో ఆర్‌అండ్‌ఆర్‌కాలనీ నిర్మించారు. ఈ రిజర్వాయర్‌ను 23 ఫిబ్రవరి-2022లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జాతికి అంకితం చేశారు. రిజర్వాయర్ మొత్తం పొడవు 22. 600 కి.మీటర్లు కాగా ఐదు ప్రధాన తూములు నిర్మించారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్ ద్వారా మొత్తం 16,43,665 ఎకరాలకు నీటి సరఫరా కోసం ప్రతిపాదించారు. 4,25,585 ఎకరాల ఆయకట్టును సింగూర్ ప్రాజెక్టు, వనదుర్గ (ఘనపూర్ అనికట్ట), నిజాంసాగర్,తపాసుపల్లి రిజర్వాయర్ల ద్వారా స్థిరీకరించారు.

**నిజాంసాగర్‌కు జీవం పోసి**

కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి నిజాంసాగర్ వరకు నీటిని అందించి రికార్డు సృష్టించారు.కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి సంగారెడ్డి కెనాల్ ద్వారా హల్దీవాగు, మంజీరాగుండా 90 కి.మీటర్లు ప్రయాణించి కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం గొల్లిలింగాల వద్ద నిజాంసాగర్‌లో గోదావరి జలాలు కలిశాయి. ఇది ఒక రికార్డు అని చెప్పాలి. వర్గల్ మండలం( సంగారెడ్డి కెనాల్ నుంచి)లో వరుసగా నాలుగు పెద్ద చెరువులు నింపుకొని హల్దీవాగుపైన 32 చెక్‌డ్యామ్‌లు నింపారు. సిద్దిపేట జిల్లాలో 9 చెక్‌డ్యామ్‌లు, మెదక్ జిల్లాలో 23 చెక్‌డ్యామ్‌లు ఉన్నాయి.

**కూడవెల్లివాగు నుంచి ఎగువమానేరు**


మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్న సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని మర్కూక్ మండలంలో చేబర్తి పెద్దచెరువు వద్ద కుడ్లేరువాగు ప్రారంభమవుతుంది.ఇదే వాగును కూడవెల్లివాగుగా పిలుస్తారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్ ద్వారా సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గంలో కూడవెల్లివాగుకు,దాని పై నిర్మించిన 33 చెక్‌డ్యామ్‌లకు 2020-21 నుంచి 6,308 ఎకరాల ఆయకట్టు ఉంది. గజ్వేల్ నియోజకవర్గంలో తొమ్మిది చెక్‌డ్యామ్‌ల ద్వారా 2,380 ఎకరాల ఆయకట్టు పారుతుంది. ఈ క్రమంలో కూడవెల్లివాగు జీవనదిగా మారి ఎగువ మానేరు డ్యామ్ వరకు నీరుఅందించడంతో పాటు దాని కింద. 16,000 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించారు. కూడవెల్లివాగుతో గజ్వేల్ నియోజకవర్గంలోని మర్కూక్, జగదేవ్‌పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గంలోని తొగుట, మిరుదొడ్డి ,దుబ్బాక మండలాల మీదుగా రాజన్నసిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేట మండలంలోని ఎగువమానేరు వరకు నీరు ప్రవహిస్తుంది.

## కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ 15టీఎంసీల సామర్థ్యంతో (ఆయకట్టు సాగు, తాగునీరు, పరిశ్రమల కోసం) మర్కూక్ మండలంలోని పాములపర్తి వద్ద నిర్మించారు. ఈ రిజర్వాయర్ వల్ల ములుగు మండలం మామిడియాల, బైలాన్‌పూర్,తానేదార్‌పల్లి గ్రామాల్లో భూమిని సేకరించారు. ఈ రిజర్వాయర్ నిర్మాణంతో మూడు గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ప్రాజెక్టు నిర్వాసితులకు ములుగు మండలం తునికి బొల్లారంలో ఆర్‌అండ్‌ఆర్‌కాలనీ నిర్మించారు. ఈరిజర్వాయర్‌ను 29 మే-2020లో అప్పటి సీఎం కేసీఆర్ జాతికి అంకితం చేశారు. కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ ద్వారా మొత్తం 2,85,280 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. ఈ రిజర్వాయర్ ద్వారా సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలు లబ్ధిపొందుతున్నాయి.

## 10 జిల్లాలు.. 24 నియోజకవర్గాలకు లబ్ధి

మల్లన్నసాగర్ రిజర్వాయర్ ద్వారా లబ్ధిపొందే జిల్లాలు మొత్తం 10 ఉండగా వాటిలో రాజన్నసిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, నల్లగొండ,కామారెడ్డి, నిజామాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి,జనగామ జిల్లాలు ఉన్నాయి. మల్లన్నసాగర్ రిజర్వాయర్ ద్వారా 24నియోజకవర్గాలు లబ్ధిపొందుతున్నాయి. వాటిలో సిరిసిల్ల, సిద్దిపేట, దుబ్బాక,గజ్వేల్, మెదక్, నర్సాపూర్, సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్, పటాన్‌చెరు, ఆలేరు, భువనగిరి ,మునుగోడు, నకిరేకల్, కామారెడ్డి, బాన్సువాడ, జుక్కల్, యల్లారెడ్డి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, బోధన్, నిజామాబాద్, జనగామ ఉన్నాయి.



సిద్దిపేట జిల్లా తొగుట మండలం తుక్కాపూర్‌లో మల్లన్నసాగర్ రిజర్వాయర్ (ఫైల్)


## సిద్దిపేట జిల్లాలోని పంపు హౌజ్ వివరాలు

1) **రంగనాయక సాగర్ రిజర్వాయర్ (3టీఎంసీలు)**
చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ వద్ద పంపుహౌజ్ నిర్మాణం
నాలుగు పంపులు , ఒక్కొక్కటి 134 మెగావాట్ల సామర్థ్యం

2) **మల్లన్నసాగర్ (50 టీఎంసీలు)**
తొగుట మండలం తుక్కాపూరు వద్ద పంప్‌హౌజ్ నిర్మాణం
8 పంపులు, ఒక్కొక్కటి 43 మెగావాట్ల సామర్థ్యం

3) **కొండపోచమ్మ రిజర్వాయర్ (15 టీఎంసీలు )**
అక్కారం వద్ద పంపుహౌజ్ నిర్మాణ
ఆరు పంపులు, ఒక్కొక్కటి 27 మెగావాట్ల సామర్థ్యం
మర్కూక్ వద్ద పంపుహౌజ్ నిర్మాణం
ఆరు పంపులు, ఒక్కొక్కటి 34 మెగావాట్ల సామర్థ్యం

# పేదల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



గజ్వేల్: లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న మంత్రి వివేక్, చిత్రంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్, జూన్ 20: పేదల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తున్నదని కార్మిక, ఉపాధి కల్పన,గనుల శాఖల మంత్రి గడ్డం వివేక్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ సమీపంలోని బింగిఎల్లయ్య గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆనాడు ఇందిరమ్మ పేదల కోసం ఇందిరమ్మ ఇండ్లు అందించి బడుగుల గుండెల్లో నిలిచిందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీని రూ.10లక్షలకు పెంచామని, రూ.900కోట్లతో సీఎంఆర్‌ఎఫ్ పథకం ద్వారా పేదలను ఆదుకున్నామన్నారు. త్వరలోనే గజ్వేల్ నియోజకవర్గంలో రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేస్తామన్నారు. రూ.13వేల కోట్లతో సన్నబియ్యం పంపిణీ చేశామన్నారు. సొంతిల్లు ఉండాలనే ఉద్దేశంతో రూ.5లక్షలతో 600ఫీట్ల వరకు మాత్రమే ఇల్లు నిర్మించుకునేలా ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి, సిద్దిపేట కలెక్టర్ హైమవతి, అదనపు కలెక్టర్లు గరీమాఅగర్వాల్, అబ్దుల్ హమీద్, ఆర్డీవో చంద్రకళ, హౌసింగ్ పీడీ దామోదర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, విజయమోహన్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

# నేడు జిన్నారంలో బీఆర్‌ఎస్ మహాధర్నా



## హాజరుకానున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు

జిన్నారం, జూన్ 20: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని జిన్నారం, పటాన్‌చెరు, అమీన్‌పూర్,రామచంద్రపురం మండలాలకు చెందిన రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులను ప్రభుత్వం జమచేయలేదు. బీఆర్‌ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా జిన్నారంలో నేడు మహాధర్నాకు పిలుపునిచ్చినట్లు ఆపార్టీ జిన్నారం అధ్యక్షుడు రాజేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో శనివారం ఉదయం 9:30 గంటలకు నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించి 27,120 రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం మొండి చేయి చూపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం జిన్నారం మండలంలోనే 10వేల పైచిలుకు రైతులకు భరోసా లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని నమ్ముకున్న రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరిగ్గాలేదని మండిపడ్డారు. రూ.12.99 కోట్ల రైతు భరోసా నిధులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని, లేని పక్షంలో ప్రభుత్వంపై పోరాటం తప్పదని ఆయన హెచ్చరించారు. ధర్నా కార్యక్రమానికి బీఆర్‌ఎస్ నియోజకవర్గ ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.